# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JULY - 2009

సంవత్సర చందా రూ. 50/-

# ప్రకటన గ్రంథము
# ఉపదేశ మాలిక
# ఇప్పుడు లభించుచున్నది

200 పేజీలతో అందమైన కవర్‌తో ముద్రించబడి యున్నది.

| | |
|---|---|
| ఒక్కొక్క కాపీ | 50/- రూ॥లు మాత్రమే |
| పోస్టేజీ | 10/- రూ॥లు |

ప్రకటన గ్రంథ ఉపదేశమాలికవలయు వారు దిగువ చిరునామాకు M.O. పంపి దానిని పొందవచ్చును.


*Satya Vani*

7-9-35, Sambamurty Street

Kakinada - 533 004

Ph: 0884- 2363722

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH


P.o. Box -80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**


*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 29 | జూలై 2009 | సంచిక -12


## దేవుని స్తుతించడమా లేక అయన నామమును వ్యర్థముగా నుచ్చరించడమా ?

## (Praising God or Taking His Name invain?)

మన నాలుకను దేవుని సుత్తించడానికి లేక శాప వచనము పలుకడానికి వినియోగిస్తామని యాకోబు చెప్పుచున్నాడు. "ఒక్క నోటనుండియే ఆశీర్వచనము శాపవచనము బయలు వెళ్ళును; నా సహోదరులారా, యీలాగుండ కూడదని " అతడు చెప్పుచున్నాడు (యాకోబు 3:10).

మనము దేవునికి స్తుతి గీతములు పాడవలెనని అజ్ఞాపింపబడి యున్నాము. "ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు మీ హృదయములలో ప్రభువును గూర్చి గానము చేయుడి" యని పౌలు చెప్పాడు (ఎఫెసీ 5:19). కొలస్సయిలోని క్రైస్తవులకు కూడ అతడు ఇంచుమించు అదే సంగతిని చెప్పాడు: "సంగీతములతోను, కీర్తనలతోను ఆత్మసంబంధమైన పద్యములతోను ఒకనికి ఒకడు బోధించుచు, బుద్ధిచెప్పుచు కృపాసహితముగా మీ హృదయములలో దేవునిని గూర్చి గానము చేయుడి" (కొలస్స 3:16).

నాలుక దేవునిని సుత్తించగలదు, శపించగలదను సంగతి విదితమే. ఆరాధనలో మనము పాటలు పాడి, దేవుని స్తుతించి ఘనపరచాలను సంగతి కూడ విదితమే. అంటే మన జిహ్వాఫలము నర్పించుచు ఆయనను ఘనపరచాలి. అయితే ఆరాధనలో వాద్యము లేకుండా పాటలు పాడుచు దేవుని స్తుతించుట జరిగినప్పుడు, క్రైస్తవులు వివాహాది కార్యక్రమములలో వాద్యములు వాడుచు పాటలు పాడుచు యుంటే అది దేవుని స్తుతించుట యవుతాదా? అవునని కొందరు, కాదని కొందరు అంటారు. అయితే ప్రశ్నయేమంటే మనం దేవుని స్తుతించడం లేదనుకొంటే ఆయన నామమును వ్యర్థముగా నుచ్చరించుటలేదా ? మనం పాటలు పాడుట ద్వారా మాత్రమే దేవుని ఆరాధించగలము, ఆయన నామమును ఘనపరచగలము. అయితే వివాహాది కార్యక్రమములలోను, అంత్యక్రియలు మొదలైన వాటిలో వాద్యోపకరణమును గూర్చిన ప్రశ్న ఉద్భవించునప్పుడు వాటిని విసర్జించుటయే మేలుకాదా? మరల, అది సహోదరుల మధ్య విభేదములను సృజించుచున్న యెడల మరింత నిశ్చయముగా ఆయా సందర్భాలలో వాద్యోపకరణం విసర్జించబడాలి. ఆరాధన కాని సమయాల్లో వాద్యముల వలన సహోదరులలో భేదములు కలుగునని ఎరిగియుండియు, వాద్యములు వాడవచ్చని చెప్పువారు నిశ్చయముగా పొరబడుచున్నారు. పారంపర్యమని, సాంఘికాచారమని మరింకేదోయని చెప్పుచు వాద్యములను వాడుట తప్పే.

ఏదైనా మతశాఖల కూటములకు వెళ్లి అక్కడ వాద్యములతో కూడిన పాటలు వారు పాడుచుండగా వారితో నేను ఏకీభవించలేను. నా మనస్సాక్షిని బట్టియు, నేను నెలకొల్పు మాదిరిని బట్టియు నేను వారితో ఏకీభవించలేను. వారితో ఏకీభవిస్తే, అక్కడ వారితో వాద్యములతోను, ఇక్కడ క్రీస్తు సంఘారాధనలో వాద్యములు లేకుండగనే ఎట్లు పాడగలనని కొందరడుగ వచ్చును. యిదంతయు వేషధారణయని, మనం బోధించేది అనుసరించువారము కామని యితరులు తలంచవచ్చును. అపవాదికి మనం ఎందుకు తావీయాలి?

అట్లే అంత్యక్రియల దగ్గర కూడ వాద్యములను నేనంగీకరించను. ఆత్మ సంబంధ పాటలు మాత్రమే ఆ సందర్భములో మేలగును, ఒకని జీవితమంతా వాద్యములు లేకుండా దేవుని స్తుతించినప్పుడు ఏదో సాంఘికాచారమని చెప్పి అతని మరణానంతరం అంత్యక్రియలలో వాద్యముల నెందుకు ఉపయోగించాలి?

క్రైస్తవలోకమంతా మంచిమాదిరి నెలకొల్పునట్లు క్రీస్తుసంఘము వైపు ఈనాడు

చూచుచున్నారు. గనుక వాక్యాన్ని చదువుచు, ఆయా అంశాలపై ఆయన వాక్యమేమి చెప్పుచున్నదో గమనించుచు సత్యమును ప్రకటించుదాం. ఆత్మసంబంధమైన పాటలు పాడుచు దేవుని స్తుతించుట మన ముఖ్య ధ్యేయం కావాలి. ఆపాడేది ఆరాధనలో గాని, బయటగాని ఎక్కడపాడినా దేవుని నామాన్ని ఘనపరచుటయే మన ధ్యేయం. అంతేగాని ఆయన నామమును వ్యర్థముగా నుచ్చరించడం మనవల్ల కాకూడదు.

# యేసుప్రభువు స్థాపించిన సంఘము

(The Church that Jesus built)

అనేకులు నిర్నిమిత్తమైన కారణముల వలన వివిధ మతశాఖలలో యున్నారు. నీవు బహుశ ఒక మతశాఖలో యున్న కుటుంబములో జన్మించి యుండవచ్చును. లేదా నీవు వారి ఆరాధనకు వెళ్లుచూ యుండవచ్చును. యివిగాని ఇంకా యిట్టి కారణాలు గాని యున్నట్లయితే, నీవు వెళ్ళుచున్న సంఘము లేఖనార్థమైన సంఘమా? అనే ప్రశ్నకు జవాబును కనుగొనవలసిన అవసరమున్నది. ఈ అంశానికి జవాబిచ్చే కొన్ని ప్రాముఖ్యాంశములను బైబిలు నుండి కనుగొందము.

**I. సంఘము నిజమైన పునాదిపై, నిజమైన నిర్మాణకునిచే కట్టబడిన సంఘమై యుండాలని దేవుని కోరుచున్నాడు.**

1. వాక్యానుసారమైన నిర్మాణకుడు అనగా యేసుక్రీస్తు స్థాపింపని యే సంఘము వాక్యానుసారమైనది కాజాలదు.
   యేసు తన సంఘమును కట్టుదును అని చెప్పెను. మత్త 16:18.
   సంఘ సభ్యులగునట్లు ఎట్టి ఆజ్ఞలకు లోబడవలెనో బోధించు అధికారమును క్రీస్తు తన శిష్యులకు అనుగ్రహించెను. మత్త 16:19; 18:18.
2. దేవుడు అజ్ఞాపింపని, మరియు అంగీకరించని అనేక మతశాఖలు కలవని దైవావేశపూరిత లేఖన భాగాలు తెలియజేయుచున్నవి. మత్త 15:13; కీర్త 127:1.
3. దీనిని బట్టి సరియైన పునాది మీదనున్న సంఘమే నిజమైనది. మత్తె 16:16, 1 కొరింధీ 3:11, కీర్త 118:22, అ॥కా 4:2.

నీవు ఆరాధనకు కూడుకొను సంఘము క్రీస్తుచే స్థాపింపబడినదా? లేకమానవ కల్పితమా ?

**II.** దేవుడు కోరునట్టి సంఘము యెరుషలేములో స్థాపింపబడినట్టిదై యుండాలి.

1. దేవుని మందిరము యెరూషలేములో స్థాపింపబడునని పాతనిబంధన ప్రవక్తలు తెలియజేసిరి. యెష 2:2-3, జెకర్యా 1:16.
2. యెరూషలేము సువార్త ప్రారంభస్థలమని ప్రభువు సెలవిచ్చెను. లూకా 24:46-49.
3. పరిశుద్ధాత్మ మీకు శక్తినను గ్రహించువరకు యెరూషలేమునుండి వెళ్ళవద్దని ప్రభువు శిష్యులకు ఆజ్ఞాపించెను, యోహా 14:26, 15:26-27,16:7-8,13.
4. క్రీస్తు పరమునకు కొనిపోబడు వరకు పరిశుద్ధాత్ముడు పంపబడలేదు. యోహాను 16:7
5. క్రీస్తు ఆరోహణమునకు అపొస్తలులు సాక్షులై యుండిరి. అ.కా. 1:9.
6. అపొస్తలులు యెరూషలేమునందు కనిపెట్టుచుండగా పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చెను అ.కా. 2:1-4.
7. యిది యోవేలు 2:28-32లో చెప్పబడిన ప్రవచనము యొక్క నెరవేర్పు. నీవు ఆరాధనకు కూడుకొను సంఘము యొక్క ప్రారంభము యెరూషలేములో కలిగినదని చెప్పగలవా?

**III.** క్రీస్తుపునరుత్థానము తరువాత పెంతెకోస్తు దినమున స్థాపింపబడిన సంఘమై యుండాలి.

1. అంత్యదినములలో సంఘము స్థాపింపబడునని ప్రవక్తలు తెలియజేసిరి. యెష 2:2-3, మీకా 4:1-2.
2. ఆ రాజుల కాలములలో అది స్థాపింపబడునని తెలియజేయబడెను దానియేలు 2:36-44.
3. పరలోక రాజ్యము సమీపించి యున్నదని బాప్తిస్మమిచ్చు యోహాను ప్రకటించెను. మత్త 3:1-2.
4. రాజ్యము వచ్చునట్లు ప్రార్థింపవలెనని అపొస్తలులు ఆజ్ఞాపింపబడిరి. మత్త 6:9-10.
5. క్రీస్తు మత్త 16:18లో భవిష్యత్ కాలమును సూచించు పదమును

ఉపయోగించుచు "నాసంఘమును కట్టుదును" అని చెప్పెను.

6. మార్కు 9:1లో అపోస్తలులు జీవించి యున్న కాలములోనే రాజ్యము బలముతో వచ్చునని సెలవిచ్చెను.

7. దేవుని రాజ్యము మీ దగ్గరకు వచ్చి యున్నదని క్రీస్తు చెప్పెను. లూకా 10:9.

8. పునరుత్థానము తరువాత పెంతెకోస్తు దినమున సంఘము స్థాపింపబడెను.

A) వారు సంఘమునకు చేర్చబడిరి. అపో.కా. 2:47.

B) 3000 మంది చేర్చబడిరి. అపో.కా. 2:41

C) అంత్యదినములలో యిది జరిగెను. అపో.కా. 2:17-21

D) వారు క్రీస్తు రాజ్యనివాసులు. కొలస్స 1:13

E) అ॥కా2 తరువాత సంఘము కొనసాగుచుండెను.

F) అది స్థాపింపబడిన కాలము క్రీ.శ. 33.

నీవు ఆరాధనకు కూడుకొను సంఘము క్రీ.శ. 33వ సంవత్సరము నందు స్థాపింపబడిదా?

**IV.** క్రీస్తు ఒకే ఒక సంఘమును స్థాపించెను.

1. మత్తయి 16:18లో సంఘము ఏకవచనము.

A). రోమా 16:16లో చెప్పబడిన 'సంఘములు' అను పదము ఒకే శరీరమును సూచించుచున్నది.

2. అపొస్తలులు అనేకమార్లు ఒకే శరీరమని చెప్పిరి. ఎఫె 4:4; రోమా 12:4-5; 1కొరింథీ 12:20 ఎఫె 1:22 -23; కొలస్స 1:18.

3. క్రీస్తు ఐక్యత కొరకు ప్రార్థించెను. యోహాను 17:20-21.

4. మనము ఏకమనస్సుతో, ఏక తాత్పర్యముతో ఉండాలని పౌలు ఆత్మావేశము వలన కోరెను. 1కొరింథీ 1:10.

5. ఒకే సువార్త అని పౌలు బోధించెను. గలతి 1:6-9.

6. అంత్యదినమందు వాక్యమే తీర్పు తీర్చునని యేసు బోధించెను యోహాను 12:48.

నీవు ఆ సంఘములో అనగా శరీరములో సభ్యుడవా?

**V.** వాక్యానుసారమైన పేరు కలిగిన సంఘములో మనం ఉండాలని దేవుని కోరిక.

A) పేరు దేవుని దృష్టిలో ప్రాముఖ్యమైనది. ఆది 5:2; 17:5, 15; 32:27-28.

B) పేరు ప్రాముఖ్యమైనది కానియెడల ప్రజలు యూదా, యెజెబెలు, ఫిడో లేక రోవర్ అను పేర్లు ఎందుకు ధరించరు?

2. సంఘము ఏ పేర్లతో పిలువబడెనో బైబిలు తెలియజేయుచున్నది.

A) నా సంఘము . మత్తయి 16:18

B) సంఘము. అపో.కా 8:1.

C) దేవుని సంఘము. 1కొరింథీ. 1:2.

D) క్రీస్తు సంఘములు రోమా 16:16.

E) క్రీస్తు శరీరము ఎఫెస్సీ 4:12.

F) జీవముగల దేవుని సంఘము. 1తిమోతి 3:15.

G) జ్యేష్టుల సంఘము హెబ్రీ 12:23

నీవు ఆరాధనకు కూడుకొను సంఘము వాక్యానుసారమైన పేరును కలిగియున్నదా?

**VI.** దేవుని ప్రజలు (సంఘములో ఉన్నవారు) వాక్యానుసారమైన పేరును కలిగియుండిరి.

1. ఆదిమ శతాబ్దములో వారు పిలువబడిన పేర్లు .

A) శిష్యులు (నేర్చుకొనువారు లేదా వెంబడించువారు) అ॥కా. 20:7.

B) పరిశుద్ధులు (రక్షింపబడిన వారు లేదా పరిశుద్ధ జీవితమును జీవించువారు) 1కొరింథీ 1:2.

C) దేవుని ప్రియులు (దేవుని ప్రేమించినవారు, విధేయులైన వారు) రోమా 1:7.

D) సహోదరులు (ఈ సంబంధము ఏకమనస్సు గలవారను భావమును తెలియజేయుచున్నది). 1కొరింథీ 15:6.

E. దేవుని కుమారులు (దేవునితో వారికి గల సంబంధము). రోమా 8:4.

F దేవుని పిల్లలు (దేవునితో వారికి గల సంబంధము). 1యోహాను 3:1.

G) దేవుని వారసులు (దేవుని స్వాస్థ్యమునకు హక్కుదారులమని అర్థము). రోమా 8:17.

H) రాజులైన యాజకులు (ప్రతి క్రైస్తవుడు ఒక యాజకుడు యితడు దేవునికి అనుకూలమగు ఆత్మసంబంధమైన బలులను అర్పించువాడు). 1 పేతురు 2:9.

క్రైస్తవులు (రక్షింపబడినవారు - యెషయా 62:2 యొక్క నెరవేర్పు). అ.కా. 11:26.

**-స్టీవ్ ఫిషెల్, U.SA.**

# టైమ్ ఎంతయ్యింది ?

(What Time is it ?)

ఈ లోకంలో అన్నిటికంటే ప్రశస్తమైనది టైమ్. కాలాన్ని వ్యర్థపర్చడం అంటే ధనాన్ని దుబారా చేయడమే. లోకంలో ఉన్న వాటన్నిటికంటే టైమ్ చాల ప్రాముఖ్యమైనదిని ఎడిసన్ చెప్పాడు. నీవు జీవమును ప్రేమించుచున్నావా? అయితే

కాలమును వ్యర్థపర్చకు. ఏలయనగా జీవమే కాలముతో ముడివడి యున్నదని ఫ్రేంక్లిన్ అనునతడు చెప్పాడు. ఉన్న అస్థులన్నిటికంటే టైమ్ చాల శ్రేష్టమైనదని సోక్రటీసు చెప్పాడు. కాలమును గూర్చి యేసుప్రభువు ఇట్లు చెప్పారు: "పగలున్నంత వరకు నన్ను పంపినవాని క్రియలు మనము చేయుచుండవలెను; రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పనిచేయలేడు" (యోహాను 9:4). మనం కాలాన్ని ఎట్లు వినియోగిస్తామో, దానిపై మన నిత్య గమ్యము ఆధారపడి యున్నది. అందువలన టైమ్ ఎంతయ్యిందో మనం గమనించాలి.

**1. అనేకులు పాపమునుండి మేల్కొనుటకు ఇప్పుడు టైమ్ అయ్యింది**

(రోమా 13:11-14): "మరియు మీరు కాలమునెరిగి, నిద్రమేలుకొను వేళయైనదని తెలిసికొని ఆలాగు చేయుడి. మనము విశ్వాసులమైనప్పటికంటె ఇప్పుడు రక్షణ మనకు మరి సమీపముగా నున్నది. రాత్రి చాల గడచి పగలు సమీపముగా నున్నది గనుక మనము అంధకార క్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన యుద్ధోపకరణములను ధరించుకొందము . అల్లరితో కూడిన ఆట పాటలైనను, మత్తయినను లేకయు, కామ విలాసములైనను పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను, మత్సరమైనను లేకయు పగటియందు నడుచుకొన్నట్టు మర్యాదగా నడుచుకొందము".

నిద్రనుండి మేల్కొనుటలో ఇమిడియున్న మూడు క్రియలను పౌలు ఈ లేఖన భాగంలో వినియోగించాడు మొదటిగా మేల్కొను క్రియ (11వ). పాపము నుండి మేల్కొనే సమయం ఇదే! ఆత్మయొక్క శత్రువు నిద్రపోడు (1పేతురు 5:8). రెండవదిగా ధరించుకొనే క్రియ (12వ). వేటిని తీసివేసి వేటిని ధరించుకోవాలో చెప్పబడింది. మనం నిత్యత్వం కొరకు ధరించుకొనుచున్నాము ! మూడవదిగా నడుచుట (13వ). మనము మర్యాదగా నడవాలి. అల్లరితో కూడిన ఆటపాటలు, మత్తు, కామవిలాసము, పోకిరి చేష్టలు లేకుండా మర్యాదగా వెలుగు సంబంధులవలె నడుచుకోవాలి. మన సమయాన్ని పాపంలో గడిపేస్తే, మనం కోసే పంట చాల తీవ్రమైనదిగా యుంటాది.

**2. దేవుని ద్రాక్షతోటలో పనిచేయుటకు వెళ్లేటైమ్ అయ్యింది.**

(మత్తయి 21:28): ఆదాము యొక్క పాపమువలన మానవుడు దేవుని ద్రాక్షతోటలో నుండి తోలివేయబడ్డాడు. క్రీస్తులో మనం ఆ ద్రాక్షతోటలోనికి మరల తీసికొని రాబడ్డాము (యెషయా 61:3; గలతీ 3:27). ఆయన యిచ్చు ప్రతి ఫలాన్ని పొందు నిమిత్తము మనం ఆయన ద్రాక్షతోటలో పనిచేయాలి (మత్తయి 20:1-11).

పనిచేసే టైమా? ఎప్పుడు? ఇప్పుడే! "నీవు పోయినేడు నా ద్రాక్షతోటలో పని చేయుము". వాయిదా వేయుట సమయాన్ని దొంగిలుటయే. తన జీవితకాల మంతయు వాయిదా వేస్తూ చివరి ఘడియలో చేరుకొన్న పనివానిగా ఎవడు నటించ వీలుపడదు. కుమారుడు సమయం చిక్కగానే వెళ్లి ద్రాక్షతోటలో పనిచేయుటకు ఒప్పుకొన్నాడు.అనేక తరుణాల తరువాత ఒప్పుకొన్నవాడు కాదతడు. మనము కూడ తరుణాలను వెదకుచు కొనుక్కొనుచు యుండాలి (ఎఫెస్సీ 5:15).

**3. యిది కోత కోసే టైమ్** (లూకా 10:2): ప్రభువు కాలమందే కోత విస్తారముగా యుంటే ఇప్పుడదేమైనా తక్కువయ్యిందా? నేడు ప్రతి జనాంగము నుండి సువార్త పిలుపు వచ్చుచున్నది. అప్పుడు పనివారు కొద్దిమందే ఎట్లుండిరో, ఇప్పుడు అంతే. గనుక వేడుకోవాలి. "ఇదిగో మీ కన్నులెత్తి పొలములను చూడుడి; అవి ఇప్పుడే తెల్లబారి కోతకు వచ్చి యున్నవి" (యోహాను 4:35).

ప్రభువును వెదికే సమయం వచ్చేసరికి కొందరికి చాల ఆలస్యమైపోయి వుంటాది (లూకా 13:25-28). ప్రభువు యొక్క రెండవ రాకడకు సిద్ధపడి ఎవరుండదో వారు బుద్ధిలేని కన్యకలవలె వెలుపటనే విడిచి పెట్టబడుదురు (మత్తయి 25:1-11). కాలము ఎంత వడిగా పరుగెత్తు చున్నదో చెప్పు అనేక హెచ్చరికలు మనకున్నాయి. "నా దినములు నేతగాని నాడెకంటెను వడిగా గతించుచున్నవి" (యోబు 7:6). "స్త్రీ కనిన నరుడు కొద్ది దినముల వాడై మిక్కిలి బాధనొందును. పువ్వు వికసించినట్లు వాడు పెరిగి వాడిపోవును. నీడ కనబడక పోవునట్లు వాడు నిలువక పారిపోవును" (యోబు 14:1,2). కాలం ఇక లేకపోయేసరికి నీవెక్కడ ఉంటావు?

"మా ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు
అధిక బలమున్న యెడల ఎనుబది సంవత్సరములగును.
అది త్వరగా గతించును, మేము ఎగిరిపోవుదుము.
మాకు జ్ఞాన హృదయము కలుగునట్లుగా చేయుము.
మా దినములు లెక్కించుట మాకు నేర్పుము " (కీర్తనలు 90:10-12).

- డగ్లస్ హేరిస్.

# పాటలు పాడుట
(Singing)

సంగీతం మన మనసులకు అహ్లాదకరంగా యుంటాది. సంగీతాన్ని బట్టి మానవులు ప్రభావితులౌతరు. మనందరికీ యున్న భావాలు వేర్వేరుగా యుంటాయి. ఒక్కోసారి మనం సంతోషానందాలతో నిండియుంటాము. మరొకసారి విచారభావాలతో నిండియుంటాము. మనమున్న మానసిక పరిస్థితిని బట్టి మనం ఇష్టపడే సంగీతం ఆధారపడి యుంటాది.

ఆరాధనలో దేవుడు సంగీతానికి గొప్ప ప్రాముఖ్యత నిచ్చారు. ప్రత్యక్ష గుడారములోను, దేవాలయములోను యూదుల ఆరాధనలో సంగీతం ఒక భాగంగా యుండేది. దావీదు వ్రాసిన కీర్తనలపై ఆధారపడిన పాటలు సాధారణంగా వారు వాడే సంగీతమని విద్యావేత్తలు చెబుతారు. తరువాత కాలంలో యూదులు తమ కీర్తనలను పాడడానికి వచ్చి దావీదు కీర్తనలను హెబ్రీ భాషలో వల్లించేవారు. కీర్తనలలో అత్యున్నతమైన భావాలను వ్యక్తపరచేవారు.

రాజైన దావీదుకాలం వచ్చేసరికి ఆరాధనలో వాద్య సంగీతం వాడబడింది. అటుపిమ్మట రెండువందల సంవత్సరాల తరువాత వాద్యసంగీతాన్ని ఆమోసు ఖండించాడు. "స్వరమండలముతో కలిసి పిచ్చిపాటలు పాడుచు దావీదువలెనే వాయించు వాద్యములను కల్పించుకొందురు" అని అతడు వ్రాసాడు (ఆమోసు 6:5). యూదులు వారి సంగీతంలో దేవుని యొక్క ఘనతను గూర్చి ఆయన యెడల వారిభాద్యతను గూర్చి పాటలు పాడేవారు.

యేసుక్రీస్తు సిలువపై మరణించగా యూదా మతము అంతమయ్యింది. దైవారాధనలో ఒక గొప్ప మార్పు కొనితేబడింది. పాతనిబంధన ప్రకారమైన ఆరాధన క్రొత్తనిబంధన ఆరాధనకంటె ఘనమైనదది కాదనే వాస్తవంపై క్రైస్తవారాధన ఆధారపడి యున్నది. రక్తబలులు, సాంబ్రాణి పొగలు మొదలగు బాహ్యసంబంధమైన క్రియలు మానవునినే ప్రభావితులు చేసేవి. అవిమానవుని శారీరక భావాలను మాత్రమే పురికొల్పేవి. క్రీస్తు మరణంతో క్రైస్తవ్యం ఆరంభమయ్యింది. యూదుల విశ్వాసంలో మార్పు వచ్చింది. మరియు వారు చేసే దైవారాధనలో గొప్ప మార్పు సంభవించినది.

ఎఫెసీ 5:19లో, "ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును

గూర్చి పాడుచు కీర్తించుడి" యని అపో,పౌలు చెప్పాడు. మరల కొలస్స 3:16లో, దేవుని గూర్చి గానము చేయుచు, సమస్త విధములైన జ్ఞానముతో క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి" యని అతడు వ్రాసాడు. ఈ దైవావేశ లేఖనములు ఆరాధనలో పాటలు పాడుటయొక్క ప్రాముఖ్యతను క్రైస్తవులకు వర్ణించుచున్నవి.

క్రొత్తనిబంధన కాలంలో క్రైస్తవులైన వారు ఆరాధనలో "అపొస్తలుల బోధయందును సహవాసమందును రొట్టె విరుచుట యందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" యని లేఖనాల్లో చెప్పబడింది (అపొ.కా.2:42). తరువాత కీర్తనలతోను, సంగీతములతోను ఆత్మసంబంధమైన పద్యములతోను హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడి యని చెప్పబడింది. గనుక అపొస్తలుల కాలమునాటి క్రీస్తు సంఘ సంగీతము కేవలము గాత్రమే, లేక పాటలు పాడుటయే యని మనకు విశదమగుచున్నది.

దేవుడు ఆరాధనలో పాటలు పాడుటను గూర్చి ఎందుకు ఆజ్ఞాపించాడో మనం తెలిసికొనడం మంచిది. క్రైస్తవారాధనలో పాటలు పాడుట ఒక భాగమైయున్నది. మనం దేవుని యెడల కలిగియుండవలసిన లోతైన భావములను గౌరవాన్ని పాటల ద్వారా వ్యక్తపరచడానికి మనం పాటలు పాడేటప్పుడు వాటి భావాన్ని గ్రహించుకొనుచు పాడాలి. ఆ మాటలలో దేవుని గూర్చి మనకున్న భావాలను, దేవునికి మనకు ఉన్న సంబంధాన్ని, లోకంలో సంఘముయొక్క పరిస్థితిని గూర్చి మన ఆత్మలలో యున్న భావాలను వ్యక్తపరుస్తాం. మనం పాడే పాటలలో లేఖనములపై ఆధారపడిన అంశములెన్నియో ఉంటాయి, ఉండాలి.

మనం పాడే పాటలు జ్ఞానయుక్తంగా యుండాలని కొలస్స 3:16, ఎఫెసీ 5:19 బోధించుచున్నవి. పాటలద్వారా మనం ఒకరికొకరు ఉపదేశించుకోవాలి, బోధించుకోవాలి, హెచ్చరించుకోవాలని చెప్పబడింది. ఇంకోమాటలో పాటల ద్వారా దేవుని చిత్తాన్ని గూర్చి, లేక దేవుని వాక్యాన్ని గూర్చి మనం ఒకరితో ఒకరు హెచ్చరించుకోవాలి. అందువలన సంఘసంగీతము హృదయాల్లో ప్రభువును గూర్చి యున్న ఉన్నతభావాలను మిగతావారికి తెలియజేసే విధానం అది.

అంతేగాక మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుడియని చెప్పబడింది. ఇంకో మాటలో మనం హృదయపూర్వకముగా పాడాలి. అయితే మనం చేసే గొప్ప పొరబాటు యేమిటంటే -పాటలు పాడేటప్పుడు మన మనస్సు

వేరేచోట యుంటాది. నోటిద్వారా మనం కలసి పాడవచ్చునేమో గాని, మనస్సులయితే వివిధ పరిధులలో తిరుగుచు యుంటాయి. అందువలన ఒకకొక విధంగాను ఇంకొకరు ఇంకో విధంగాను పాడుటజరుగుతాది. దైవారాధన ఆత్మతోను సత్యముతోను యుండాలి. "కాబట్టి ఆత్మతో ప్రార్థన చేతును, మనస్సుతోను ప్రార్థన చేతును". ఆత్మతో పాడుట యంటే మన పాటలయొక్క భావమును గ్రహించి హృదయపూర్వకముగా పాడుట. తరువాత మనం సత్యముతో పాడాలి. అంటే మనం పాడే పాటలు సత్యవాక్యప్రకారం ఉండాలి. దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17). ఒక్కోసారి లేఖనము ప్రకారములేని పాటలను కొందరు పాడుచు యుంటారు. ఉదాహరణకు: క్రీస్తు ఇప్పుడు రాజైయున్నారు. ఆయన రాజ్యమే ఆయన సంఘము. ఆయన రాజ్యం స్థాపింపబడి ఇప్పుడున్నది. ఆయన రాజుగా దేవుని కుడిపార్శ్వమున ఉండి పాలించుచున్నారు. ఈ గొప్ప సత్యాన్ని ఎరుగని వారు క్రీస్తు రాజుగా రాబోవుచున్నాడని, పాటలు పాడతారు యిది సత్యవాక్యానికి విరుద్ధంగా యున్న భావం గనుక మనం పాడే పాటలు గ్రహించుకొని, అవి లేఖనము ప్రకారమున్నవో లేవో యని తెలిసికొని పాడాలి.

పాటలు పాడుట ఆరాధనలో ఒక భాగం అని గ్రహించిన తరువాత దానిలో పాలుపొందడానికి మనం ఆసక్తిచూపాలి. చాలసార్లు అనేకులు ఆరాధనకు ఆలస్యంగా చేరుకొంటారు. వారు వచ్చేసరికి పాటల కార్యక్రమం అయిపోవచ్చు. మనం రైలులో ప్రయాణించాలన్నా విమానంలో ప్రయానించాలన్నా ఆయా స్థానాలకు ఎప్పుడూ ఆలస్యంగా వెళ్లం. సరిగదా నిర్ణీత సమయంనికంటే ముందుగానే వెళ్తాం. అట్లయినప్పుడు ఆరాధనకు ఆలస్యంగా ఎందుకు చేరుకోవాలి?

దైవారాధన నిష్కపటంగా యుండాలి. దానిలో ఆత్మీయత, దేవునియందలి భయభక్తులు కనబరచాలి. మనం ఆరాధనలో ప్రవేశించడానికి సంగీతం దోహదం చేస్తాది. యిది వాద్యసంగీతం కాదు. క్రైస్తవారాధననుండి దేవుడు వాద్యాలను బహిష్కరించారు. ఆయన బహిష్కరించిన దానిని మనం తీసికొనివచ్చి ఆరాధనలో వినియోగించరాదు. మనం చేయు ఆరాధన మనకు గాక దేవునికి ప్రీతికరంగా యుండాలి. "అందువలన మనము నిశ్చలమైన రాజ్యమును పొంది దైవకృప కలిగి యుందము. ఆ కృప కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదము. ఏలయనగా మన దేవుడు దహించు అగ్నియై యున్నాడు" (హెబ్రీ 12:28,29).

–జాషువా గూటం.

# అనీతిమంతుల విజయము తాత్కాలికము

( The victory of the wicked is short )

ఆరవ దూత బూర ఊదినప్పటినుండి ఏడవ దూత బూర ఊదు వరకు, ఈ మధ్య కాలంలో జరిగిన సంఘటనలు ప్రకటన 11వ అధ్యాయములో వ్రాయబడినవి. 3నుండి 12వచనాల్లో ఇద్దరు సాక్షులను గూర్చి మనం చదువగలము. "వారు 1260 సంవత్సరముల ప్రవచింతురు" అని వ్రాయబడింది. వారు ప్రకటించుట ముగించగానే అగాధములోనుండి వచ్చు కౄరమృగము వారితో యుద్ధము చేసి జయించి వారిని చంపును. వారి శవములు ఆ మహాపట్టణపు సంత వీధిలో పడియుండును. ఎవరును వాటిని కనీసమర్యాదలతో పాతిపెట్టలేదు. మూడు దినములైన తరువాత దేవుని యొద్దనుండి జీవాత్మ వచ్చి వారిలో ప్రవేశించెను. గనుక వారు పాదములు ఊని నిలిచిరి. వారు మేఘారూఢులై పరలోకమునకు ఆరోహణమైరి.

అనీతిమంతుల విజయము తాత్కాలికమని ప్రబోధించే ఈ పాఠము విశ్వాసులకు ప్రోత్సాహకరమైనది అవును. వారి విజయము కొంతకాలము మట్టుకే, అది కేవలము తాత్కాలికము. ఏదేను వనంలో సాతాను స్వల్పకాలమే పనిచేసెను, కాని దేవుడే విజయమును సాధించి స్త్రీ సంతానమును గూర్చిన వాగ్దానమును చేసెను (ఆది 3:15). యోసేపు సోదరులు కొన్ని సంవత్సరాలు యోసేపుపై విజయము సాధించినట్టు కనపడినను, తరువాత ఐగుప్తులో తమ సోదరుని ఎదుట సాగిలపడిరి, దేవుని పిల్లలను ఫరో కొంతకాలము బానిసత్వములో నుంచినను దేవుని బాహుబలము ఆయన హస్తము వారిని విడిపించెను. హామాను యూదుల హృదయాల్లో భయాన్ని కలిగించినను తాను నిర్మించిన ఉరికొయ్యపై ఒకానొక దినమున వ్రేలాడెను. శుక్రవారమున క్రీస్తు సిలువ వేయబడెను. ఆదివారమున తెల్లవారుచుండగా ఆయన సమాధినుండి లేచెను. సంఘము అనేక శ్రమలను హింసలను ఎదుర్కొనెను. కాని ఆయన రాజ్యము యొక్క విత్తనము నాశనము కాలేదు. ప్రతి దేవుని బిడ్డ భౌతిక మరణాన్ని రుచి చూసినను క్రీస్తు రాకడలో మనము విజయోత్సవముతో ముందుకు రాగలము.

పైన చెప్పబడిన అనేక ఉదాహరణలలో అనీతిమంతులు విజయము

సాధించినప్పటికిని ఆ విజయము కొంతకాలమునకే పరిమితము. అంతిమ విజయము అనీతి మంతులకు చెందదు. అంతిమ విజయము నమ్మకమైన దేవుని పిల్లలకు చెందును. "దేవుని మూలముగా పుట్టిన వారందరును లోకమును జయించుదురు. లోకమును జయించిన విజయము మన విశ్వాసమే" (1యోహాను 5:4). "మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక" (1కొరింథీ 15:57).

– విక్టర్ యమ్, ఎస్క్యు (TVC)

## గమనిక

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న
సత్యవాణి T.V కార్యక్రమములను
దిగువ సమయాల్లో తప్పక చూడండి

**ప్రతి ఆదివారం ఉదయం 6.30 గం॥కు రక్షణ ఛానల్**
**ప్రతి ఆదివారం సాయంత్రం 6:00 గం॥కు శుభవార్త ఛానల్**
**ప్రతి సోమవారం ఉదయం 6.00 గంటలకు శుభవార్త ఛానల్‌లో**
**ప్రతి బుధవారం ఉదయం 7:00 గంటలకు విస్సా ఛానల్‌లో**
**ప్రతి శనివారం సాయంత్రం 6.00 గం॥లకు రక్షణ ఛానల్**

# తబిత
## *Tabitha*

తబిత యొప్పేలోని సంఘ సభ్యురాలు. ఈ పేరు హెబ్రీ భాష లోను గ్రీకు భాషలోను దొర్కా అని కూడ పిలువబడును. ఈమె చేసిన సత్కార్యములు, ధర్మ కార్యములు పరిశుద్ధ గ్రంధములో బహుగా పొగడబడినవి. ఈమె యొక్క శరీరాకృతిని గూర్చి యెక్కువ తెలియదుగాని, ఆమె పరిశుద్ధత యను అలంకారమును కలిగి యుండెను. తబిత వ్యాధి గ్రస్థురాలై చనిపోయెను. యొప్పేలోని క్రైస్తవులు అపొస్తలుడైన పేతురు లుద్దలో యున్నాడని తెలిసికొని యొప్పేకు రమ్మని కబురు చేసిరి (అపొకా. 9:36-42). తబిత యింటి దగ్గర విధవరాండ్రందరును చేరి యేడ్చుచు ఆమె తమతో యున్నపుడు కుట్టిన అంగీలును, వస్త్రములను చూపుచు పేతురు యెదుట నిలిచిరి. పేతురు అందరిని వెలుపలకు పంపి, మోకాళ్లూని ప్రార్ధన చేసి శవము వైపుతిరిగి తబితా లెమ్మనగానె ఆమె కన్నులు తెరచి పేతురును చూసి లేచి కూర్చుండెను. పేతురు విధవరాండ్రను, పరిశుద్దులను పిలచి ఆమెను సజీవురాలినిగా వారికి అప్పగించెను.

### సత్క్రియలు

మంచి పనులు అనగా మనము ఇతరుల కొరకు చేయు సహాయము. కైసరయలోని కొర్నేలి దేవుని యందు భయభక్తులు కలిగి యుండి ప్రజలకు చేయు ధర్మకార్యము లన్నియు దేవుని సన్నిధిలోనికి వెళ్లినట్లు వైద్యుడైన లూకా వ్రాసెను. **(అపో.కా 10:1-4)**. మన పరలోక తండ్రి యైన యెహోవా అందరికి ఉపకారి **(కీర్తనలు 145:9)**. ఆయన చెడ్డవారి మీదను, మంచివారి మీదను వర్షము కురిపించుచున్నాడు **(మత్తయి 5:45)**. కయీను తన తమ్ముడైన హేబెలును చంపినపుడు నీవు సత్క్రియ చేసిన యెడల తల నెత్తికొనవా ? సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచి యుండును. నీ యెడల దానికి వాంఛకలుగును నీవు దానిని ఏలుదువని దేవుడైన యెహోవా చెప్పెను **(ఆది.కా. 4:7)**. సత్క్రియలు చేయవలెనని మొదటి నుండియు మనకు దేవుడు చెప్పుచున్నాడు. దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలు చేయుచు, అపవాది చేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను **(అది.కా. 10:38)**. తీర్పు దిన మందు మంచి కార్యములు చేసిన వారిని చూచి, నాతండ్రి చేత

ఆశీర్వదింపబడినవాలారా, రండి, లోకము పుట్టినది మొదలు కొని మీ కొరకు సిద్ధ పరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి అని యేసు చెప్పును. మంచి కార్యములు చేయని వారితో నశింప బడినవారలారా ; నన్ను విడచి అపవాదికిని, వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి అని చెప్పును **(మత్తయి 25:31-46).**

## విలువ గల పరిచర్య

సత్క్రియ చేయు ప్రతి వానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ మహిమయు, ఘనతయు, సమాధానము కలుగునని ప్రతిక్రైస్తవ సంఘమును అపోస్తలుడైన పౌలు హెచ్చరించుచున్నాడు **(రోమా 2:10; 12: 7-21, 15:2).** తబిత తన యొక్క మంచి కార్యములు ద్వారా మహిమ , ఘనత , సమాధానములను పొందెను. ఎవడును తనకొరకే కాదు, ఎదుటి వానికి మేలు చేయ చూచుకొనవలెను **(1కొరింథి 10:23).** యొప్పేలోని క్రైస్తవులకు తబిత ఈ విధమైన పరిచర్య చేసినది, అన్నిటియందు యెల్లప్పుడు మీలో మీరు సర్వసమృద్ధి గలవారై ఉత్తమ మైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీయెడల సమస్త విధములైనకృపను విస్తరింపచేయ గలడు **(2 కొరింథి 9:8-9; కీర్తనలు 12:9).** అపోస్తలుడైన పౌలు గలతీ సంఘమునకిట్లు వ్రాయుచున్నాడు "మనకు సమయము దొరికిన కొలది అందరియెడలను, విశేషముగా విశ్వాసగృహమునకు చేరిన వారి యెడలను మేలుచేయుదము" **(గలతీ 6 :10).** తబిత యొప్పేలోని విశ్వాసగృహమునకు చెందిన విధవరాండ్రకు ఈవిధమైన మంచి కార్యములు చేయుచుండెను. మనము వాటి యందు నడుచు కొనవలెనని దేవుడు ముందుగా సిద్ధ పరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడిన వారమై ఆయన చేసిన పనియైయున్నాము **(ఎఫెసీ 2:10).** మనము చేయు మంచికార్యములు మనోహరమైన సువాసనయు, దేవునికి ప్రీతి కరమును, ఇష్టమైన యాగమునైయున్నవి **(ఫిలిప్పీ 4:9).** మేము మీనిమిత్తము ప్రార్థన చేయుట మానక, మీరు సంపూర్ణజ్ఞానమును , ఆత్మసంబంధమైన వివేకము గలవారునై, ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమునందు అభివృద్ధి చెందుచు, అన్ని విషయములలో ప్రభువును సంతోష పెట్టునట్లుగా నడచుకొనవలెననియు, ఆనందముతో కూడిన పూర్ణమైన ఓర్పును, దీర్ఘశాంతమును కనుబరచునట్లు ఆయన మహిమశక్తినిబట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెననియు, పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగునట్లు

మనలను పాత్రులనుగా చేసెను............. **(కొలస్స 1:10-12).** మంచి పనులచేయుటకు యెన్నడును విసుకవద్దు మీరు ఒకని యెడల ఒకడును, మనుష్యులందరి యెడలను యెల్లప్పుడును మేలైన దానిని అనుసరించి నడుచుకొనుడి **(1థెస్స 5:15).** మేలు చేయుటలో విసుకవద్దు **(2 దెస్స3:13).** తబిత తన మంచి కార్యముల ద్వారా తన్నుతాను అలంకరించుకొననది. పరలోకమందున్న తండ్రియైన దేవుని యొద్ద ధనమును ప్రోగు చేసికొననది **(1 తిమోతి 2:10;6:18).** దైవ జనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగ సిద్ధపడియుండునట్లు, దైవా వేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును. ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతి యందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది **(2 తిమోతి3:17).** మేలు చేయువాడు దేవుని సంబంధి. కీడుచేయువాడు దేవునిని చూచిన వాడు కాడు **(3 యోహాను11).**

## ప్రాముఖ్యత

క్రొత్తనిబంధన గ్రంథములో మంచి పనుల యొక్క ప్రాముఖ్యతను గూర్చి, వాటి విలువనుగూర్చి మనము చదువుదుము. మంచి కార్యములు ఆత్మీయ ఫలములలో ఒకటిగను దేవునికిష్టమైన సువాసనగల యాగముగను, ఒక ఆభరణముగను దేవుని మహిమార్థమైయుండి మనకు పరలోకములో ధనముగ యుండును. తబిత పరలోకమందు యెక్కువ ధనమును సమకూర్చుకొనినది (మత్తయి 6:19-20). పేదలను కనికరించుట ద్వారా తబిత దేవునికి అప్పుయిచ్చినది (సామెతలు 19:17).

యదార్థహృదయులు అవసరతలలో యున్నవారికి సహాయము చేయుదురు. అట్టివారు కరుణా కటాక్షములను కిరీటముగ ధరింతురు (కీర్తనలు 63:3). ఆయనను వెంబడించు వారి యెడల ఆయన ఎంతోకనికరము గలవాడు. క్రైస్తవులమైన మనము మన పరలోకపు తండ్రి యొక్క ప్రేమ, దయలను రుచి చూచి యున్నాము (1పేతురు 2:3). ఆయన ప్రేమ, కనికరము గల దేవుడైనందున అనేకులను స్వస్థపరచుచుండెను (మత్తయి 9:36), వారికి బోధించుచుండెను (మత్తయి20:34). ఆహారముపెట్టుచుండెను. (మార్కు 1:41; లూకా 9:12). ఆయన నాయీను విధవరాలి యెడల ఎంతోకనికరము గలవాడై ఆమె కుమారుని బ్రతికించెను. (లూకా7:11-18). యెరూషలేము నుండి యెరికోపోవుచున్న వ్యక్తి దొంగల చేతిలోచిక్కిగాయ పరచబడినపుడు అతనిని ఎక్కిరించుకొని అతని విషయమై జాగ్రత్త వహించెను (లూకా

10:30-37). కనికరములేనిచే కష్టములలో యున్నవారికి, అవసరతలలో, ఆపదలలో యున్న వారికి మనము సహాయము చేయలేము. మీ తండ్రి కనికరము గల వాడైయున్నట్లు, మీరును కనికరము గలవారై యుండుడి (లూకా 6:36).

తబిత తన మంచి కార్యముల ద్వారా మహిమను, ఘనతను, అక్షయతను , నిత్యజీవమును సంపాదించుకొనినది (రోమా 2:7). దీనికి ఆశ్చర్యపడకుడి, సమాధులలో యున్నవారందరు ఆయన శబ్దము వినిమేలు చేసిన వారు జీవపునరుద్ధానమునకు, కీడు చేసినవారు తీర్పు పునరుద్ధానమునకును బయటకు వచ్చెదరు (యోహాను 5:28-29).

మనము మరణము చెందినపుడు మనలను గూర్చి ప్రజలు యేమి చెప్పుదురు? ఈలోకమును మనము విడిచి పెట్టునపుడు మనవెంట యెటువంటి క్రియలు వచ్చును? (ప్రకటన 14:13). తబిత యొక్క జీవితముతో మన జీవితములను సరిపోల్చు కొనిన మనస్థాన మెచ్చట యుండును?.

- కవిత గూటం

## అసూయ -ఒక భయంకర పాపము

(Envy A deadly Sin)

ఎవరికైనా అదృష్టము కలసివస్తే నీవు సంతోషించెదవా? ఉద్యోగములో నీకంటే ముందుగా ఎవరికైనా ప్రమోషన్ వస్తే నీవు సంతోషించెదవా? నీవు చేసినదానికి నీకు మెప్పు రాకపోయినను యితరులు చేసిన దానికి వారికి మెప్పువస్తే నీవు సంతోషించెదవా? యిట్టి పరిస్థితుల్లో చాలసార్లు మనం సంతోషముగా యుండము. దానికంతటికి కారణము అసూయ. ఇతరులకు కలగినమేలులు ఆస్థి మొదలైనవాటిని గూర్చిన అసంతృప్తి, దుస్వభావములే అసూయయని నిఘంటువు పరంగా మనం చెప్పుకోవచ్చును. తాను కోరేది మరొకడు కలిగి యున్నప్పుడు కలిగే నిరసనభావం అసూయ.

అసూయ సర్వసామాన్యమైన ఒక సమస్య. అది భౌగోళిక సరిహద్దులనేమీ ఎరుగదు, అది యౌవనులలోను, వృద్ధులలోను. ధనవంతులలోను, దరిద్రులలోను,

ఉపదేశకునిలోను, విద్యార్థిలోను కనబడును. అసూయనుండి విడుదల పొందిన వాడెవడు మనకు కనబడక పోయినను, ఈ పాపాన్ని కనుగొనడం అంత సులభమయిన పనికాదు. ఎందుకంటే, ఒక నేరస్థుడు తన రూపురేఖలను కప్పిపుచ్చులాగున అసూయ అనేక నామకరణములను ధరిస్తొది. అనేకమైన యితర పాపములలోను మన సంతోషాన్ని నాశనం చేయుటకు సాతానుడు వినియోగించే అతి ప్రమాదకరమైన పనిముట్టు అది.

ఈ లోకములో మొట్టమొదటి నరహత్యకు కారణము అసూయే. ఏలయనగా అసూయ బట్టియే కయీను తన తమ్ముడైన హేబెలును హత్యచేసెను (ఆది 4:1-8). అసూయవలన యోసేపు సహోదరులు అతనిని బానిసగా అమ్మివేసిరి (ఆది 37). దేవుడు మోషే అహరోనుల కిచ్చిన ప్రముఖస్థానములను గూర్చి కోరహు దాతాను అబీరాములు అసూయచెంది తిరుగుబాటు చేసిరి. దేవుడు ఆ ముగ్గురినీ వారి అనుచరులగు రెండువందల యాభైమందినీ నాశనము చేసెను (సంఖ్యా 16). ఈ ప్రపంచ చరిత్రయంతటిలోను అతి ఘోరమైన పాపకృత్యమును, దేవుని కుమారుడైన యేసుక్రీస్తును సిలువ వేయించుటలో యున్న పాపములలో అసూయ ఒకటి. పిలాతు యేసును విడుదల చేయగోరెను. "ఏలయనగా వారు అసూయచేత ఆయనను అప్పగించిరని అతడు ఎరిగి యుండెను" (మత్తయి 27:18).

అసూయ మన జీవితమును నెమ్మదిగా కొరికివేయునట్టి రోగము వంటిది. అది మితిమీరిపోయేవరకు అనేకసార్లు అది కనబడక యుండును. "సాత్వికమైన మనస్సు శరీరమునకు జీవము. మత్సరము ఎముకలకు కుళ్ళు" (సామెతలు 14:30). "అయితే మీ హృదయములలో సహింపనలవికాని మత్సరమును వివాదమును ఉంచుకొనిన వారైతే అతిశయపడవద్దు, సత్యమునకు విరోధముగా అబద్ధమాడవద్దు. ఈ జ్ఞానము పైనుండి దిగివచ్చినది కాక భూసంబంధమైనదియు ప్రకృతి సంబంధమైనదియు దయ్యముల జ్ఞానమువంటిదియునై యున్నది. ఏలయనగా మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతి నీచ కార్యమును ఉండును" (యాకోబు 3:14-16.

మత్సరముతోబాటు మిళితమైయున్న మరికొన్ని ఇతర పాపములను గమనించుము. కొతమంది అన్యజనులు సమస్తమైన దుర్నీతిచేతను దుష్టత్వము చేతను లోభముచేతను ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము నరహత్యకలహము కపటవైరమను వాటితో నిండిన వారై యుండిరని పౌలు చెప్పెను (రోమా 1:29). అందువలన

"అల్లరితో కూడిన ఆటపాటలైనను మత్తతయినను లేకయు, కామవిలాసములైనను పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను మత్సరమైనను లేకయు పగటియందు నడుచుకొన్నట్టు మర్యాదగా నడుచుకొందము" అని పౌలు మరల చెప్పుచున్నాడు (రోమా 13:13).

యితరులకు అదృష్టము లభించినప్పుడు మనమెట్లు ప్రవర్తించాలి? యితరులు దీవించిబడినప్పుడు క్రైస్తవుడు నిజముగా ఉల్లసించు స్వభావము కలిగి యుండాలి. అనేకసార్లు యితరుల సాధక బాధకములను వినుటకు వారి ఆపదలలో సహాయపడుటకు మనము సులభముగా సంసిద్ధులగుదుము. గాని వారి సంతోషములో నిజంగా పాలు పొందుటకు, వారిని ప్రోత్సహించుటకు మనకు చాల కష్టతరముగా యుండును.

మన తోటివారిని గూర్చి యధార్థమైన ప్రేమ సుహృద్భావములతో మనము నిండి యుండాలి. నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుట యనునది పాత నిబంధనలో రెండవ ప్రాముఖ్యమైన ఆజ్ఞయని యేసు చెప్పెను (మత్తయి 22:37-40). ప్రేమ మత్సర పడదు అని పౌలు వ్రాసెను (1 కొరింధీ 13:4). యితరులకు మేలుకలుగగా మనము సంతోషించాలి. వారు దీవించబడుచున్నందున కృతజ్ఞత చెల్లించాలి. మనమట్లు చేసిన యెడల మనము సంతోషముగా యుండుటయే గాక మన దేవుని సంతోషపెట్టిన వారమగుదుము.

-రానీ లోవే


## రేడియో శ్రీలంక ద్వారా

సత్యవాణి రేడియో కార్యక్రమములు

తెలుగు : ప్రతి ఆది సోమ, బుధ వారాల్లో

మధ్యాహ్నం 2: 00 నుండి 2.15 వరకు

ఒరియా : ప్రతి ఆదివారం

ఉదయం 6:45 నుండి 7.00 వరకు

సత్యవాక్యాన్ని రేడియోలో వినండి, అందరికీ విన్పించండి !

## సంక్షిప్త వార్తలు

**2009** మే నెల **20** వ తేదీ బుధవారం రాత్రి వీధివారి లంకలో జరిగిన సువార్త కూటములో రిక్కీగూటం గారు వాక్యపరిచర్య చేయగా అనేక వందల మంది దేవుని వాక్యమును ఆసక్తితో వినిరి . అక్కడ సోదరులు డేవిడ్ రాజుగారు మంచి పని చేయుచున్నారు.

మే **22**వ తేదీ శుక్రవారం విశాఖపట్టణంలో న్యూ రైల్వే కోలనీలో యున్న క్రీస్తు సంఘము ఏర్పాటు చేసిన కూటమునకు రిక్కీగూటం గారు, ఎలిషే ప్రభాకరరావ్‌గారు, సోదరులు కె. అప్పారావు గారు హాజరై వాక్యపరిచర్యచేసిరి. అక్కడ సోదరులు, కె.వి. రామారావు గారు ఆసక్తితో సువార్త చాటుచున్నారు.

మే **23**వ తేదీ శనివారం శ్రీకాకుళం క్రీస్తు సంఘము ఏర్పాటుచేసిన "యువకులసదస్సులో" రిక్కీగూటంగారు ముఖ్యఅతిధిగాను, ప్రసంగీకుని గాను పాల్గొనిరి, సోదరులు R.Ch. సద్గుణరావ్ గారు, ఆయన కుమారుడు Dr.ఉత్తమ్‌రాజుగార్లు చేసిన తీవ్రకృషివలన ఆయువకుల సదస్సు విజయవంతమాయెను. ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లనుండి వచ్చిన అనేక యువతీ యువకులు పాల్గొని ఆత్మీయముగా బలపరచబడిరి. ఒరిస్సా నుండి వచ్చిన వారికి ఒరియా బైబిళ్లు అందియ్యబడెను.

**2006** జూన్ **24**వ తేదీ బుధవారం కాకినాడ సత్యవాణి క్రీస్తుసంఘ ఆవరణలో సువార్తకుల సదస్సు రిక్కీగూటం గారి అధ్వర్యమున ఘనముగా జరిగెను. **120** మంది సువార్తికులు హాజరై ఆత్మీయ సహవాసములో పాలుపంచుకొనిరి. పలువురు వర్తమానములనందియ్యగా, "Is God of the Bible True ?" అనే అంశముపై నున్న DVD ని పెద్దతెరపై ప్రదర్శింపబడెను. దానిని తిలకించిన సువార్తికులు ముగ్ధులైరి, హాజరైనవారందరికీ మంచి భోజనం ఏర్పాటు చేయబడెను. అమెరికాసోదరి మెలిస్సా పూల్ గారు కూడా ఆ రోజు హాజరైరి. తదుపరి జూన్ **26**వ తేదీ

. శుక్రవారం పెద్దాపురమునకు సమీపముగా యున్న తిమ్మాపురంలో జరిగిన కూటములో రిక్కీగూటంగారు వాక్యపరిచర్యచేసిరి. మెలిస్సా గారు స్త్రీలకు, చిన్నపిల్లలకు వాక్యమును బోధించిరి. సుదీపగూటం గారు తెలుగునకనువదించిరి. అందరు సంతోషించి దేవునిస్తుతించిరి. జూన్ 27వ తేదీ శనివారం సాయంత్రం కొవ్వూరులో జరిగిన కూటములో రిక్కీగారు వాక్యోపదేశముగావించగా, మెలిస్సాగారు, సుదీప గూటం గారు స్త్రీలకు, పిల్లలకు వాక్యపరిచర్య చేసిరి. కొవ్వూరులో సోదరులు బట్టు చంటిగారు పరిచర్య చేయుచున్నారు. జూన్ 30వ తేదీ రాత్రి పోతుకూరులోను, జూలై 1వ తేదీ నాడు కొత్తపేటలోను పైవిధముగా కూటములు జరిగినవి. రిక్కీగారు. మెలిస్సాఫూల్ సుదీపగూటం గార్లు హాజరైరి. పోతుకూరులో ప్రభాకర్ గారు, కొత్తపేటలో నవజీవన్ గార్లు మంచి పనిచేయుచున్నారు.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2009-2011

**To**

From:
**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**